www.hamsakalam.com
సంచలన తెలుగు దినపత్రిక
PRGI: TGTEL/26/A3129
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:91 WEDNESDAY , AUGUST 19, 2026 PAGES:8 COST: 4/-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 91 బుధవారం 19 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-



కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క , ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు



# బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదే

హంసకలం వార్త: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలం గాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణిం చారు. అమరవీరుల స్తూపా నికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండా లని స్పష్టం చేశారు. మంగళ వారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మిగతా2లో



# రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ..

## మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు

- రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న మంత్రి తుమ్మల
- గతంలో విడతలవారీగా చెల్లించి రైతులపై రూ.2,630 కోట్ల వడ్డీ భారం మోపారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విడతలో రూ.20,617 కోట్లు మాఫీ చేసిందని వెల్లడి

# ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది




- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య

హంసకలం వార్త: తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ లో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు మిగతా2లో



# అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

- అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి అభినందనలు
- షట్లర్ గాయత్రి, షూటర్ ధనుష్‌లను ప్రశంసించిన రేవంత్ రెడ్డి
- వీరిద్దరూ తెలంగాణకు, దేశానికి గర్వకారణమని వ్యాఖ్య
- జాతీయ క్రీడా పురస్కారాల విజేతలందరికీ శుభాకాంక్షలు
- భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

హంసకలం వార్త: ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు, షట్లర్ పుల్లెల గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరూ తెలంగాణతో పాటు దేశానికే గర్వకార ణమని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి, మిగతా2లో

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

- ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని నితిన్ నబిన్ ఆరోపణ
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



హంసకలం వార్త: దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష మిగతా2లో



# టిస్ స్నాతకోత్సవం.. ముఖ్య అతిథిగా సీజేఐకి బదులు మరొకరు!

- టిస్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సీజేఐ సూర్యకాంత్ స్థానంలో మరొకరు
- ఆగస్టు 2న జరగాల్సిన కార్యక్రమం ఆగస్టు 22కు వాయిదా
- విద్యార్థుల నిరసనల భయంతోనే ఈ మార్పు అని ప్రచారం
- సీజేఐ గత వ్యాఖ్యలపై విద్యార్థుల్లో వ్యతిరేకత
- షెడ్యూల్ ఖాళీగా లేదని సీజేఐ కార్యాలయం వెల్లడి

హంసకలం వార్త: ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తమ 86వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిని మార్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ స్థానంలో టాటా మెమో రియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేశ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు సంస్థ ప్రకటించింది. గతంలో వాయిదా మిగతా2లో

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. వివరాలు 2లో..

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి



- రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు
- పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య
- కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు

హంసకలం వార్త: సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రె స్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయి లా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను మిగతా2లో

# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి..

## రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

- కాన్ఫరెన్స్ ను నిర్వహించిన నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్
- స్మార్ట్ సిటీ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామన్న శ్రీధర్ బాబు



హంసకలం వార్త: తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మిగతా2లో

# టీజీఎస్ఆర్టీసీ 'మీటికెట్'

## ఒకే యాప్‌లో ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్ బుకింగ్

సమూలంగా మారిన టీజీఎస్ఆర్టీసీ 'మీటికెట్' యాప్ 2

బస్సు టికెట్‌తో పాటు చివరి గమ్యానికి ఆటో, క్యాబ్ బుకింగ్ సౌకర్యం

# బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదే

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ.. మేం చేసి చూపించాం

కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో రుణమాఫీ ప్రక్రియ అత్యంత పేలవ ంగా సాగిందని ఆయన ఆరోపించారు. రైతు రుణ మాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఆయన గణాంకాలతో సహా వివరిం చారు. 2014లో మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చినప్పటికీ, లక్ష రూపాయల రుణమాఫీని బీఆర్ ఎస్ ప్రభుత్వం ఒకేసారి అమలు చేయలేకపోయిం దని గుర్తు చేశారు. నాలుగేళ్ల పాటు విడతల వారీగా నిధులు విడుదల చేయడంతో రైతులపై అదనంగా రూ. 2,630 కోట్ల వడ్డీ భారం పడిందని తెలిపారు. ఇక 2018లో మళ్లీ లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఇచ్చి, కేవలం సగం మంది రైతులకే వర్తింపజేసి, మిగిలిన రూ. 8,379 కోట్ల బకాయి లను పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తొలి పంట కాలం లోనే ఏకకాలంలో రూ. 20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిందని తుమ్మల వెల్లడించారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా 25,35,964 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను అత్యంత పారదర్శ కంగా మాఫీ చేయడం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుం టోందని వివరించారు. ప్రస్తు తం దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకే పంట రుణ బకాయిలు అత్యంత తక్కువగా ఉన్నాయ ని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివే దిక ధ్రువీకరించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని.. అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పు డు 22A లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22A భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి..

తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

## టీజీఎస్ఆర్టీసీ 'మీటికెట్'..

తెలంగాణలో ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ కీలక ముందడుగు వేసింది. తమ 'మీటికెట్' యాప్‌లో సమూలంగా మార్పు చేసి, మల్టీ-మోడల్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్‌గా తీర్చిదిద్దింది. ఇకపై ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలుతో పాటు ఆటోలు, క్యాబ్‌లను కూడా ఒకే యాప్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించింది. సోమవారం టీజీఎస్ఆర్టీసీ ఈ కొత్త అప్‌డేట్‌ను ప్రకటించింది. ఈ నూతన విధానం ప్రకారం, ప్రయాణికులు ఆర్టీసీ బస్సు లేదా మెట్రో రైలులో టికెట్ బుక్ చేసుకున్న తర్వాత, తమ చివరి గమ్యస్థానానికి చేరుకోవడానికి అవసరమైన ఆటో లేదా క్యాబ్‌ను కూడా అదే యాప్‌లో ముందుగానే రిజర్వ్ చేసుకోవచ్చు. చెల్లింపుల ప్రక్రియ కూడా సులభతరం చేశారు. వినియోగదారులు చెల్లించిన ఛార్జీలు ఆటోమేటిక్‌గా సంబంధిత రవాణా భాగస్వాములకు బదిలీ అవుతాయి. అయితే, ఆర్టీసీ సొంతంగా ఆటోలు కొనుగోలు చేసి నడుపుతుందంటూ వస్తున్న వార్తలపై యాజమాన్యం స్పష్టత ఇచ్చింది. ఆర్టీసీ స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం గానీ, నిర్వహించడం గానీ చేయదని తేల్చిచెప్పింది. భవిష్యత్తులో కూడా అలాంటి ప్రతిపాదన లేదని పేర్కొంది. ఇది కేవలం ఇప్పటికే ఉన్న రవాణా వ్యవస్థలను అనుసంధానించే ప్రక్రియ మాత్రమేనని, ఆటో డ్రైవర్లు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరింది. లాస్ట్-మైల్ కనెక్టివిటీ కోసం ఈవీ ఆటోలు కొనే ప్రణాళిక లేదని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఇటీవల స్పష్టం చేశారు.

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

## టోల్ ఫ్రీ నెంబర్ పేరుతో కమీషన్లు దండుకుంటున్నారు

హైవేల పై వాహనాల వద్ద టోల్ ఫీజు వసూలు చేసినట్లే.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కమీషన్లు దండుకుంటున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన ఆస్తులను సరిచేస్తామని ప్రకటించి తీసుకొచ్చిన 1800 599 4788 టోల్ ఫ్రీ నెంబర్ వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆయన విమర్శించారు. ఆ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి 30 శాతం కమీషన్ ఇస్తేనే పని పూర్తి చేస్తామని డీల్ మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు నేరుగా నిధులు వసూలు చేసుకోవడానికి ఈ నెంబర్‌ను ప్రవేశపెట్టారని మండిపడ్డారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను, చివరకు ఇందిరమ్మ ఇళ్లను కూడా నిషేధిత జాబితాలోకి తీసుకెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

"క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి, ధనుష్ తెలంగాణకు గర్వకారణం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వీరితో పాటు 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు గెలుచుకున్న విజేతలందరికీ ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడా రంగంలో వారు చూపిన పట్టుదల, నిబద్ధత, కఠోర శ్రమ యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, మరెన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## మోదీ పై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## టిస్ స్నాతకోత్సవం.. ముఖ్య అతిథిగా సీజేఐకి బదులు మరొకరు!

ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తమ 86వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిని మార్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్థానంలో టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సంస్థ ప్రకటించింది. గతంలో వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 22న ముంబైలోని డియోనార్ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ స్నాతకోత్సవం ఆగస్టు 2న జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి రెండు రోజుల ముందు దీనిని వాయిదా వేశారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి పర్యటన సందర్భంగా విద్యార్థుల నుంచి నిరసనలు వ్యక్తమవుతాయనే ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆకస్మిక వాయిదాతో ప్రయాణ, వసతి ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారికి జరిగిన ఆర్థిక నష్టాన్ని భర్తీ చేస్తామని సంస్థ హామీ ఇచ్చింది. గతంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, విద్యార్థుల నిరసనలపై పోలీసు చర్యలను సమర్థించడం వంటి అంశాలు వివాదానికి దారితీశాయి. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించడాన్ని కూడా వందలాది మంది విద్యార్థులు వ్యతిరేకించారు. మరోవైపు, నవంబర్ వరకు తన షెడ్యూల్ బిజీగా ఉన్నందున కొత్త తేదీల్లో హాజరు కాలేనని ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం టిస్ యాజమాన్యానికి తెలియజేసినట్లు సమాచారం.

# సంపాదకీయం

## సింహాసనం వణకలేదు, స్పందించింది!




సమాజ విశ్లేషకులు డానీ రాసిన 'సింహాసనం వణికింది' వ్యాసం నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై జరిగిన 'కాక్రోచ్' విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా రాసినట్టుగా కనపడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పూర్తిగా టార్గెట్ చేసింది. వ్యాసకర్త ఎక్కడా విద్యార్థుల ఆందోళనకు దారితీసిన పరిస్థితులపై కానీ, విద్యార్థుల డిమాండ్లను విశదీకరించటంపై కానీ, నీట్ లీక్ సూచనలపై కానీ దృష్టి పెట్టలేదు. మోదీని ప్రపంచ నియంతగా చూపించి హిట్లర్ పక్కన చేర్చే ప్రయత్నానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.జంతర్ మంతర్ ఉద్యమం మొదటి కోరిక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ప్రధానమంత్రి విద్యార్థుల కోరిక తీర్చారు. కానీ డానీ మాత్రం, 'ఇంతకాలం ఒక నారటివ్‌ను మన చేత నమ్మించారు: భారత ప్రధాని సర్వశక్తిమంతులు, సర్వజ్ఞులు. వారు అనుకున్నదే జరుగుతుంది. ఎంతటివారైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వారు హిమాలయాలంత ఎత్తులో ఉంటే, దేశంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట మాత్రమే,' అని వ్యాసకర్త తన ఊహాజనిత కథనం రాశారు. తాను హిమాలయాలంత ఎత్తు అన్న భావన ప్రధానికీ లేదు. తాను తూర్పు కనుమల్లోని చిన్న గుట్ట అన్న అభిప్రాయం ప్రతిపక్ష నాయకునికీ లేదు, ఆ పార్టీ శ్రేణులకూ లేదు. దేశ ప్రజలకూ లేదు. ఈ రెండు అభిప్రాయాలూ వ్యాసకర్త సొంత అభిప్రాయాలు మాత్రమే. ఆయన దృష్టిలో వారిరువురికీ ఇచ్చిన స్థానం అది. దానిని పాఠకులపై రుద్దే ప్రయత్నం చేశారు.

'షాహీన్ బాగ్, మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతు ఉద్యమం, మహిళా రెజ్లర్ల ఆందోళనలు వంటి సంఘటనలను సామాజిక వర్గాల ఉద్యమంగా ముద్ర వేసి సమాజం నుంచి వేరు చేశారు,' అంటూ అవి సాధించని విజయాన్ని జంతర్ మంతర్ సాధించిట్లు సూత్రీకరించారు వ్యాసకర్త. అవును, ఆ గత ఉద్యమాల పరిధి, విస్తృతి చిన్నది కాబట్టే అవి దేశవ్యాప్తం కాలేకపోయాయి. వాటి పట్ల కూడా కేంద్రం నియంత పోకడ ఎక్కడా చూపించలేదు. పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది. కాబట్టే అవి కొంతకాలం రగిలి శాంతించాయి. ఆ ఉద్యమాలు వేరు. జంతర్ మంతర్ ఆందోళన వేరు. మొదటివి కాస్తో కూస్తో అనుభవం, పెద్దరికం, నిర్దిష్టమైన నిర్మాణంతో ఉద్యమించాయి.జంతర్‌మంతర్‌లో 'బొద్దింకలు' మాత్రమే ఆందోళనలు చేశాయి. నాయకత్వం వహించాయి. ఇవి లేవనెత్తిన అంశం దేశవ్యాప్తమైన యువతకు సంబంధించిన సమస్య. కింది కులాల వారికంటే, అసంఖ్యాక మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల సమస్య. కాబట్టే ఎలాంటి నిర్మాణం, నాయకత్వం, నిధుల సమీకరణ వంటి ముఖ్యమైన అంశాలు లేకున్నా, సోషల్ మీడియా పిలుపుతోనే బలమైన గొంతుకలను సమీకరించాయి, బలంగా వినిపించాయి. మరో కీలకమైన అంశం ఏమిటంటే, ఏ దేశంలోనైనా యువత ఆందోళనలు చాలా వాడిగా వేడిగా ఉంటాయి. వాటి పట్ల ప్రభుత్వాలు చాలా అప్రమత్తంగా ఉంటాయి. కట్టుదాటితే శాంతి భద్రతలు, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఈ ప్రజాస్వామిక స్పృహ కేంద్రానికి బలంగా ఉంది. ఈ ఆందోళనలో కూడా ఎన్నో అపశ్రుతులు దొర్లాయి. మోదీ వ్యతిరేక శక్తులు ఇందులో పనిచేశాయి. రక్షణ బలగాలపై దాడులు జరిగాయి. ప్రధానిని, ఆయన తల్లిని అమానవీయకరమైన వ్యాఖ్యలు చేసి దూషించారు. అవి అవసరం లేదు. ఐనా ఎందుకు చేశారు? బహుశా ఉద్యమాన్ని రక్తపు మడుగుల దిశగా నడిపించాలని అదృశ్య శక్తులు తలపోసి ఉండవచ్చు. ఈ అంశాన్ని పసిగట్టే ప్రధాని 'మన పిల్లలు' అన్న భావనతో సమస్య పరిష్కారం కోసం ముందడుగు వేశారు. ధర్మేంద్ర ప్రధాన్ ఎంత బలమైన నాయకుడు ఐనా, తాను నమ్మిన నేత ఐనా, ఆయన నేతృత్వంలో బీజేపీ గెలుపు గుర్రం అధిరోహించినా, అప్పటికే నీట్‌పై కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నా కూడా, విద్యార్థుల మొదటి డిమాండ్‌ను నెరవేర్చి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు ప్రధానమంత్రి. మిగిలిన రెండు డిమాండ్‌లను అంగీకరించారు. ఇది ప్రజాస్వామ్య పాలకుడికి ఉండాల్సిన మొదటి లక్షణం. నియంతలకు ఇలాంటి ఇజం ఉండదు.'ఈ ఉద్యమం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా నిరూపించింది. నాయ కుడు అన్నీ తాను కాకూడదు. ప్రజలను ఉద్యమించేలా చేయాలి. ఇది సీట్ల కోసం, పదవుల కోసం, కూటముల కోసం పరస్పరం తగవులాడుకుంటూ రోజు రోజుకూ బలహీనపడుతున్న విపక్షాలకు ఒక గుణపాఠం. ప్రజలను వీధుల్లోకి తీసుకురండి. ప్రజలకు నాయకత్వం అప్పజెప్పండి' అంటూ విపక్షాలను కూడా నెమలి ఈకల విమర్శతో నిమిరారు వ్యాసకర్త. లేకపోతే తన లోగుట్టు పూర్తిగా బయటపడుతుందని, 'సమాజ విశ్లేషకులు' అన్న పదానికి మరక పడుతోందని జాగ్రత్తపడ్డారు, భయపడ్డారు. వెరసి, ఈ వ్యాసకర్త బొద్దింకల మాటున 'పెద్ద బొద్దింక'గా గుర్తింపు పొందేందుకు తెగ తాపత్రయపడ్డారు. ప్రధానమంత్రిని ఎంత బలంగా బోనులో నిలబెడితే, తనకు అంతే గుర్తింపువస్తుందని చాలా ఆశపడ్డారు.

# కొత్త రైల్వే జోన్ సరే.. అన్యాయాల మాటేమిటి?



ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా ఎట్టకేలకు విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పేర కొత్త రైల్వే జోనల్ కార్యాలయం ఏర్పాటయింది. అయితే దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న కొత్త రైలు మార్గాల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొత్త జోన్ ఏర్పడే వరకు సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఆదాయంలో దేశం మొత్తంలో మూడో స్థానంలోనూ, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలోనూ ఉన్నది. అయినా నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేక రైల్వే స్టేషన్లు, రైలు మార్గాలు ఇతర రైల్వే జోన్లలో కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరిగింది.మాచర్ల--నల్లగొండల మధ్య 92 కి.మీ రైల్వే లైను నిర్మాణ పనులు 1997--98లో ప్రారంభం కాగా, కోటిపల్లి--నర్సాపూర్‌ల మధ్య 57 కి.మీ, పిఠాపురం--కాకినాడ మధ్య 22 కి.మీ నూతన రైల్వే లైన్ నిర్మాణ పనులు 2001--02లో, కడప--బెంగళూరు మధ్య 255 కి.మీ పనులు 2008--09లో, నడికుడి--శ్రీకాళహస్తి మధ్య 308 కి.మీ, గూడూరు--దుగరాజపట్నం మధ్య 45 కి.మీల పనులు 2011--12లో ప్రారంభమయ్యాయి. ఇక 2012--13లో భద్రాచలం రోడ్--కొవ్వూరు మధ్య 152 కి.మీ, కంభం-- ప్రొద్దుటూరు మధ్య 110 కి.మీ, కొండపల్లి--కొత్తగూడెం మధ్య 120 కి.మీ మేరకు కొత్త రైల్వే లైన్ల పనులు ప్రారంభించారు. అంటే ఈ పనులు చేపట్టి దశాబ్దాలు దాటుతున్నా నేటికీ పూర్తి కాలేదు. కోటిపల్లి--నర్సాపూర్‌ల మధ్య రైలు మార్గం నిర్మాణం పూర్తయితే కోనసీమ ప్రజలకు రైలు ప్రయాణ సదుపాయం కలుగుతుంది. ఈ సర్వే పూర్తి చేసిన సమయానికి ఖర్చు అంచనా రూ.498 కోట్లు కాగా, నేడు అది రూ.1200 కోట్లకు పెరిగింది. ఈ నేపథ్యంలో అసలు నూతన రైలు మార్గాలు పూర్తవుతాయా? అనే అనుమానం కలుగుతోంది. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం ప్రతిపాదిత కొత్త రైల్వే మార్గాల ఏర్పాటుకు అయ్యే వ్యయంలో కనీసం ఆరు శాతం ఆదాయం వచ్చే అవకాశం ఉంటే చాలు. కానీ తెలుగు రాష్ట్రాలలో ప్రతిపాదించిన ప్రతి కొత్త రైల్వే మార్గంలో 6 నుంచి 10శాతం ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయినా అవసరమైన నిధులు కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలియదు.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో 22 మార్గాలలో నూతన రైల్వే లైన్ల ఏర్పాటుకు సంబంధించి రెండు దశాబ్దాల కిందటే సర్వేలు పూర్తయ్యాయి. మార్కాపురం--శ్రీశైలం--హైదరాబాద్‌ల మధ్య 290 కి.మీ, మాచర్ల--గద్వాల్ మధ్య 184 కి.మీ, నెల్లూరు--రాజంపేట మధ్య 120 కి.మీ, సామర్లకోట--చింతూరుల మధ్య 150 కి.మీ, కల్యాణదుర్గం--అనంతపూర్‌ల మధ్య 58 కి.మీ, భద్రాచలం--సత్తుపల్లి మధ్య 54.1 కి.మీ మేరకు నూతనంగా రైల్వే లైన్లు వేయాలనే ప్రతిపాదనలు వచ్చాయి. వీటి సర్వేలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి పుష్కరకాలం దాటింది. ఇవి కార్యరూపం దాల్చుతాయో లేదో తెలియదు. కానీ కేవలం ఆరేళ్ల క్రితం తమిళనాడులో కొత్తగా ప్రారంభించిన 14 రైల్వే లైన్ల పనులు, కర్ణాటకలో ప్రారంభించిన 18 రైల్వే లైన్ల పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో కొత్తగా నంద్యాల--ఎర్రగుంట మధ్య 126 కి.మీ, కాకినాడ--కోటిపల్లి మధ్య 45 కి.మీ, (ఇది కొత్త లైను కాదు, రెండో ప్రపంచ యుద్ధం సమయంలో దెబ్బతిన్న ఈ మార్గాన్ని పునరుద్ధరించారు) కృష్ణపట్నం--ఓబులవారిపల్లి మధ్య 113 కి.మీ మేరకు మాత్రమే రైల్వే లైన్లు వేశారు. కానీ ఇదే సమయంలో తమిళనాడులో కొత్తగా ఏడు లైన్లు, కర్ణాటకలో ఏడు లైన్లు పూర్తయ్యాయి.

ఇక ఆదాయం విషయానికి వస్తే-- దేశవ్యాప్తంగా ఉన్న (కొత్తగా ఏర్పడిన విశాఖ రైల్వే జోన్ కాకుండా) 17 రైల్వే జోన్ల నుంచి 2024--25లో 2,65,002.4 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. ఇందులో నార్త్ సెంట్రల్ రైల్వే జోన్ మొదటి స్థానంలో, ఈస్ట్‌కోస్ట్ జోన్ రెండో స్థానంలో, సౌత్ సెంట్రల్ రైల్వే మూడో స్థానంలో ఉంది. దక్షిణాది రాష్ట్రాలలో అయితే ప్రథమ స్థానంలో ఉంది. సౌత్ సెంట్రల్ జోన్ నుంచి పెద్దమొత్తంలో ఆదాయం లభిస్తున్నా అభివృద్ధి పరంగా ఈ జోన్‌కు నామమాత్రంగా కూడా నిధులు కేటాయించడం లేదు.

కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు ముందు కొత్తవలస--అరకు రైలు మార్గాన్ని ప్రస్తుతం విశాఖ డివిజన్ నుంచి తప్పించి రాయగఢ్ డివిజన్ పరిధిలోకి చేర్చారు. ఈ కారణంగా పర్యాటక కేంద్రాలైన అరకు, బొర్రాగుహల ద్వారా లభించే ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. రాయచూర్--వాడి మధ్యలో ఉన్న 108 కి.మీ రైలు మార్గం, పగిడిపల్లి--విష్ణుపురం--జాన్‌పహాడ్ మధ్య ఉన్న 142 కి.మీల రైల్వేలైన్లను గుంతకల్ నుంచి విడదీసి సికింద్రాబాద్ డివిజన్‌లో కలిపారు. అదేవిధంగా జగ్గయ్యపేట ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా అధిక ఆదాయం లభించే మోటమర్రి-- జగ్గయ్యపేట మార్గాన్ని దగ్గరలో ఉన్న విజయవాడ డివిజన్‌కు బదులుగా సికింద్రాబాద్ డివిజన్‌లో ఉంచారు.

అంతేకాకుండా మన రాష్ట్ర పరిధిలోని దాదాపు 500 కి.మీల రైల్వే లైన్లు ఇతర రాష్ట్రాల రైల్వే జోన్ల పరిధిలో కొనసాగుతున్నాయి. ఉదాహరణకు తడ--గూడూరు మధ్య ఉన్న 68 కి.మీ రైల్వే లైను చెన్నై కేంద్రంగా ఉన్న దక్షిణ రైల్వే జోన్‌లో, ధర్మవరం--హిందూపూర్ మధ్య ఉన్న 107 కి.మీ రైల్వే లైను సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్‌లోని బెంగళూరు డివిజన్‌లో ఉన్నాయి. అలాగే ఆంధ్ర ప్రాంతానికి చెందిన సూళ్లూరుపేట, నగరి ప్రాంతాలు సదరన్ రైల్వేలో; హిందూపూర్--పెనుగొండ, పుట్టపర్తి--హిందూపూర్‌లు సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్లలో ఉన్నాయి. తాజాగా విశాఖపట్నానికి అత్యంత చేరువలో ఉండే శృంగవరపుకోట, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలు రాయగఢ్ డివిజన్ పరిధిలో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాలలో ప్రతిపాదించిన కొత్త రైలు మార్గాల పరిస్థితి దయనీయంగా ఉంది. నూతన రైలు మార్గాలు పొందడానికి ఆర్థికంగా, నైసర్గికంగా తెలుగు రాష్ట్రాలకు అన్ని రకాలుగా అర్హత ఉంది. అయినా కేంద్ర ప్రభుత్వ వివక్ష, రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యుల ఉదాసీనత కారణంగా తీవ్ర అన్యాయం జరుగుతోంది. దీనిని సరిదిద్దాలి.

# రాజ్యాంగబద్ధంగా ఐదు ఆర్థికహక్కులు



కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నది ఒక ప్రధాన చర్చగా మారింది. ప్రతిపక్షాలు తమ ఆరోపణలకు రుజువుగా-- సుప్రీంకోర్టు కొన్ని కేసుల విషయంలో ఇస్తున్న తీర్పులను, ఎలక్షన్ కమిషన్ వ్యవహారశైలిని, విపక్ష నేతలపై ఈడీ చేస్తున్న దాడులను పేర్కొంటున్నాయి. అయితే రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని వీటికి పరిమితం చేస్తే అది పాక్షికమే. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో వ్యక్తమవుతున్న నిర్లక్ష్యాన్ని, దానికి గల కారణాలను పరిశీలించకపోతే రాజ్యాంగంపై దాడి సమగ్రంగా అర్థం కాదు.

జనవరి 26, 1950 నుంచి మనం వైరుధ్యభరితమైన సమాజంలోకి అడుగుపెట్టబోతున్నాం" అని రాజ్యాంగసభలో అంబేద్కర్ హెచ్చరించారు. "మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎన్నో వ్యత్యాసాలు, అసమానతలు ఉన్నాయి. ఈ అసమానతల కారణంగా ఒక వ్యక్తి-- ఒక ఓటు-- ఒకే విలువ అనే సూత్రం నిరాకరించబడుతున్నది. ఈ విలువను ఇలాగే చాలాకాలంపాటు నిరాకరిస్తూపోతే మనం కష్టపడి తెచ్చుకున్న రాజకీయ ప్రజాస్వామ్యాన్ని చేజేతులా ప్రమాదంలో పడవేసుకున్నట్టే" అని ఆయన అన్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే అంబేద్కర్ చెప్పినట్టుగా తరతరాలుగా కొనసాగుతున్న అసమానతలను తొలగించాలి. రాజ్యాంగ ఆశయం కూడా ఇదే.

అందుకే రాజ్యాంగంలోని పీఠిక ప్రతి పౌరుడికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని హామీ ఇస్తూ హోదాలోనూ అవకాశాల్లోనూ సమానత్వాన్ని లక్ష్యంగా ప్రకటించింది. అంటే సామాజిక న్యాయాన్ని రాజ్యాంగపు మౌలిక లక్ష్యంగా ప్రకటించింది. ఈ మౌలిక లక్ష్యంలో భాగంగా ప్రతి పౌరుడూ గౌరవంగా జీవించాలని ఆర్టికల్ 21 ప్రతిపాదిస్తున్నది. ప్రజల శ్రేయస్సును పెంపొందించేందుకు సామాజిక వ్యవస్థను మార్చాలని; వ్యక్తుల మధ్య, వర్గాల మధ్య ఆదాయ అసమానతలను తగ్గించడానికి ప్రయత్నించాలనీ ఆర్టికల్ 38(1), (2) చెబుతున్నాయి. అక్కడే ఆగకుండా ఇంకా ముందుకువెళ్లి సహజ వనరులపై యాజమాన్యం, నియంత్రణ ప్రజలకు కలిగించాలనీ సంపద, ఉత్పత్తి సాధనాలను వికేంద్రీకరించేలా ఆర్థిక వ్యవస్థను నిర్వహించాలనీ ఆర్టికల్ 39(బి), (సి) ఆదేశిస్తున్నాయి. ఈ రకంగా పౌరుల మధ్య అసమానతలు లేని సమాజాన్ని అవి నిర్దేశిస్తున్నాయి. అందుకే ఈ రాజ్యాంగ అవతరణతో దీర్ఘకాలిక విప్లవం ప్రారంభమైందని మార్క్సిస్టు ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పేర్కొన్నాడు. నిజమే, రాజ్యాంగం కంటే ముందునాటి సమాజంతో పోల్చినప్పుడు ఈ రాజ్యాంగం విప్లవ స్వభావాన్ని కలిగి ఉన్నదనటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఆచరణలో జరిగిందేమిటి?ఏం జరిగిందంటే-- టాటా--బిర్లా ప్లాన్ అమల్లోకి వచ్చింది. రాజ్యాంగం ఆదేశించిన దానికి వ్యతిరేకమైన పరిస్థితులు ఉనికిలోకి వచ్చాయి. 1960లోనే ప్రణాళిక విధానం ద్వారా పోగుపడిన సంపద ఎవరిపరమైనదన్న ప్రశ్న ఎదురయింది. ఇందుకు ప్రొఫెసర్ పీసీ మహలనోబీస్ అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. భారతదేశంలో ఇంతవరకు అమలైన ప్రణాళికలు ప్రైవేటు పెట్టుబడికి, మరీ ముఖ్యంగా అందులో భారీ ప్రైవేటు పెట్టుబడిదారుల అభివృద్ధికి దోహదపడ్డాయని, అందువల్ల సంపద కేంద్రీకరణ పెరిగిందని ఆ కమిటీ తేల్చింది. దీన్ని నిరోధించాలని ఎమ్ఆర్‌టీపీ చట్టాన్ని 1970లో తీసుకువచ్చారు. అయినప్పటికీ ఆ చట్టం పారిశ్రామిక కుటుంబాల దగ్గర సంపద పోగుపడే విధానాన్ని నిరోధించలేక, చిత్తుకాగితంగా మిగిలిపోయింది. మరీ ముఖ్యంగా 1991లో నూతన ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చిన తర్వాత కనీవినీ ఎరగని స్థాయిలో సంపద పోగుపడటం, అసమానతలు మరింత పెరగటం కనబడుతుంది.

1990 నాటికి దేశంలోని 10 పారిశ్రామిక కుటుంబాల ఆస్తులు రూ.42 వేల కోట్లు ఉంటే, 2007 నాటికి ఒక్క ముకేశ్ అంబానీ ఆస్తే రూ.1లక్ష 44వేల కోట్లకు పెరిగింది. ఈ రకంగా టాటా--బిర్లాలు పోయి అంబానీ--అదానీల చరిత్ర ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలో.. సమాజంలో పైభాగంలో ఉన్న ఒక శాతం మంది దగ్గర 40 శాతం సంపద పోగుపడింది. అదే పైభాగంలో ఉన్న 10 శాతం వారి దగ్గర 65 శాతం సంపద ఉంటే, కింది భాగాన ఉన్న 50 శాతం ప్రజల దగ్గర కేవలం 3 నుంచి 6 శాతం సంపద మాత్రమే ఉంది. ఇక మధ్యలో ఉన్న 40 శాతం మంది ఆస్తులు 28 నుంచి 29 శాతంగా ఉన్నాయి. మొత్తం దేశ జనాభాలో 0.001 శాతంగా ఉన్న అపర కుబేరుల ఆస్తి 46 కోట్ల మంది జనాభా ఆస్తికి సమానంగా ఉంది.

ఒకవైపు ఈ రకమైన వ్యత్యాసాలు, అసమానతలు పెరుగుతూ ఉంటే, మరొకవైపు నేటికీ ప్రజలు కనీస అవసరాలను తీర్చుకోలేని స్థాయిలో ఉన్నారు. మానవ అభివృద్ధి అధ్యయన సంస్థ 2021లో రూపొందించిన నివేదిక ప్రకారం, 33.3శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. అందువల్లనే మన దేశం ఆకలి సూచికలో ప్రపంచంలో 102వ స్థానంలో ఉంది. మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు లేక పారిశుధ్య సమస్యలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో 2200 క్యాలరీల కంటే తక్కువ తీసుకునే వారి నిష్పత్తి 1993--94 మధ్య 58 శాతం ఉంటే, 2011--12 మధ్య 68 శాతానికి పెరిగింది. సరైన పోషకాహారం లేక, వైద్య సౌకర్యాలు అందక అయిదేళ్లలోపు పిల్లలలో 5.4 లక్షల మంది మరణిస్తున్నారు. రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు ఇంతకంటే రుజువులు అవసరం లేదు.

హంస కలం వార్త
బుధవారం 19 ఆగష్టు 2026

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో శేరి సతీష్ రెడ్డి





(ఆగస్టు -18- హంసకలం వార్త )

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ కెపిహెచ్ బి టెంపుల్ బస్‌స్టాప్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కె పి హెచ్ బి , బాలాజీనగర్ గౌడ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన శేరి సతీష్ రెడ్డి.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, కెపిహెచ్ బి డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణీంద్ర, నాగమల్లేశ్వరరావు, రంగమోహన్, నితీష్ గౌడ్, మనీ గౌడ్, శ్రీధర్ చారి, గిరి నాయుడు, రామకృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కళ్యాణ్ బాబు, దుర్గా ప్రసాద్, స్వరూప గౌడ్, పొన్నం రజిత గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



(ఆగస్టు -18- హంస కలంవార్త )

మల్కాజిగిరి: శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మల్కాజిగిరిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కలువ పువ్వులతో సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి మరి మమతా రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్లు మంజుల జగదీష్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, శిరీష జితేందర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సురేష్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళల పూజా కార్యక్రమాలు, భక్తుల సందడితో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.



# ఆదివాసీ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి: మహేష్ కుమార్ గౌడ్

( ఆగస్టు -18- హంస కలంవార్త )

గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ, జిల్లా అధ్యక్షుల ఎన్నికలపై ఎగ్జిక్యూటివ్ సమావేశం

హైదరాబాద్: గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ, జిల్లా అధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, ఆదివాసీ కాంగ్రెస్ విస్తరణ, రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షుల ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై నాయకులతో చర్చించి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎస్టీ, లంబాడీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్టీలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, వివిధ కమిటీల్లో తగిన ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





-స్క్రోలింగ్ పాయింట్స్

-ఎస్టీ, లంబాడీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాం.

-వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.

-ఎస్టీలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, కమిటీల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తాం.

-రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

-పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు లభించేలా చూస్తాం.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

( ఆగస్టు-18- హంస కలంవార్త )

కూకట్‌పల్లి: తెలంగాణ వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ( జి.వి.ఆర్) ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన వీరత్వం, పోరాట స్ఫూర్తి, ప్రజాసేవా భావం నేటి తరాలకు ఎప్పటికీ ఆదర్శప్రాయమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహనీయుని జయంతి సందర్భంగా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. జై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున, మేకల రమేష్, గూడెపు నాగరాజు, మహేష్ కుమార్, కృష్ణవేణి, జ్యోతి, నర్సింగ్ గౌడ్, చెదురువల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో జనసేన నాయకులు ప్రేమకుమార్



( ఆగస్టు -18- హంస కలంవార్త )

భారతమాత ముద్దుబిడ్డ తొలి తెలుగు బహుజన చక్రవర్తి శ్రీ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు: ప్రేమ కుమార్ ఈ రోజు కెపిహెచ్బి కాలనీ 3 వ ఫేస్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమమునకు తెలంగాణ రాష్ట్ర గౌడ సంగ నాయకులు రాజేష్ గౌడ్, వినోద్ గౌడ్ ఆహ్వానం మేరకు కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టేడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపట్టానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం గౌడ సంగ నాయకులు ప్రేమ కుమార్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, పోలబోయిన శ్రీనివాస్ ,గౌడ సంగ నాయకులు , సభ్యులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఖరీదైన మద్యం బాటిళ్ల పట్టివేత



(ఆగస్ట్ -18- హంస కలంవార్త )

మిలిటరీ క్యాంటీన్ నుంచి కొనుగోలు.. అధిక ధరలకు విక్రయాలు 22 స్కాచ్ మద్యం బాటిళ్లు స్వాధీనంమల్కాజిగిరి: మిలిటరీ క్యాంటీన్ నుంచి ఖరీదైన స్కాచ్ మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి, వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 22 స్కాచ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శక్తినగర్, ఆర్‌కేపురం, కాప్రా ప్రాంతంలో డిఫెన్స్‌కు సంబంధించిన రాధా కృష్ణశ్యామల్ అనే వ్యక్తి ఖరీదైన స్కాచ్ మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. సమాచారం మేరకు మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కోటమ్మ సిబ్బందితో కలిసి రాధా కృష్ణశ్యామల్ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఖరీదైన 22 స్కాచ్ మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణలో మద్యం బాటిళ్లను మిలిటరీ క్యాంటీన్ నుంచి కొనుగోలు చేసి, ఒక్కో బాటిల్‌పై రూ.500 నుంచి రూ.1,000 వరకు అదనంగా వసూలు చేస్తూ విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను తదుపరి చర్యల నిమిత్తం కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్ రావు తెలిపారు.

# భవన అనుమతి ఫైల్ ప్రాసెసింగ్‌కు రూ.20 వేల లంచం.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

(ఆగస్టు -18- హంస కలంవార్త )



హైదరాబాద్, ఆగస్టు 18: భవన అనుమతి ఫైల్‌ను ప్రాసెస్ చేసి, భవన అనుమతి ఉత్తర్వులు, పని ప్రారంభ లేఖ జారీ చేసేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.దఏసీబీ వివరాల ప్రకారం.. హైదరాబాద్ చార్మినార్ జోన్, సంతోష్‌నగర్ సర్కిల్-25 జీహెచ్ఎంసీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సి. ప్రభావతి, ఫిర్యాదుదారుడి భవన అనుమతి ఫైల్ ప్రాసెసింగ్‌తో పాటు భవన అనుమతి ఉత్తర్వులు, పని ప్రారంభ లేఖ జారీకి సహకరించాల్సి ఉంది. ఈ పనుల కోసం ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. ఫిర్యాదుదారుడి సమాచారంతో రంగంలోకి దిగిన సిటీ రేంజ్-1 ఏసీబీ అధికారులు మంగళవారం వల పన్ని, లంచం సొమ్ము స్వీకరిస్తున్న సమయంలో ప్రభావతిని పట్టుకున్నారు. ఆమె నుంచి రూ.20 వేల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అధికారిక విధులను నిజాయితీకి విరుద్ధంగా నిర్వహిస్తూ అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. అనంతరం నిందితురాలిని నాంపల్లిలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట జ్యుడిషియల్ రిమాండ్ కోసం హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## కూకట్‌పల్లి ట్రాఫిక్ సమస్యలపై కమిషనర్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చర్చ



( ఆగస్టు-18- హంస కలంవార్త )

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న రోడ్డు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను ఆమె కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజ క వర్గంలోని పలు కీలక రహదారులు, బ్రిడ్జిలు, లింక్ రోడ్ల అభివృద్ధిపై ప్రధానంగా చర్చిం చారు. కూకట్‌పల్లిలోని ప్రకాశ్‌నగర్ రోడ్డు విస్తరణ, మెట్రో నుంచి మూసాపేట్ మీదుగా వెళ్లే వైట్‌హౌస్ రోడ్డును తెరవడం, మూసాపేట్ చౌరస్తా నుంచి కైతలాపూర్ బ్రిడ్జి వరకు రోడ్డు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా కుత్బులా ్లపూర్ నుంచి రైల్వే అండర్‌పాస్‌కు సంబంధించిన పనులు కూడా త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా పనులకు ఇప్పటికే నిధులు మంజూరైనప్పటికీ పనులు ఆశిం చిన స్థాయిలో వేగంగా కొనసాగడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫతేనగర్ బ్రిడ్జి పనులను సత్వరమే ప్రారంభించాలని, బోయినపల్లి డివిజన్ పరిధిలో బోయినపల్లి ప్రధాన రహదారి నుంచి అస్మత్‌పేట్‌కు వెళ్లే అంబేద్కర్ రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే బాలానగర్ నుంచి వై జంక్షన్ మీదుగా ఎర్రగడ్డ వరకు బ్రిడ్జి నిర్మా ణానికి సంబంధి ంచిన పనులను ముందుకు తీసుకె ళ్లాలని సూచిం చారు. మెట్రో నుంచి కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో పాటు నియోజ కవర్గంలోని అన్ని లింక్ రోడ్లను అం దుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా కైతలాపూర్ ఫ్లైఓ వర్ నుంచి దిగిన తర్వాత కేపీహెచ్‌బీ వైపు వచ్చే యూటర్న్ వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, అక్కడ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లు, బ్రిడ్జిలు, లింక్ రోడ్ల అభివృద్ధి పనులను సమన్వ యం తో వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ప్రజలకు, వాహనదా రులకు ఇబ్బం దులు లేకుండా పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ కళాకారుల బోనాల జాతర వేడుకలు



( ఆగస్ట్ -18- హంస కలంవార్త )

హైదరాబాద్, ఆగస్టు 18 (హంస కలంవార్త): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ కళాకారుల బోనాల జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారు, ప్రముఖ కళాకారుడు దరువు అంజన్న, నవతెలంగాణ పత్రిక విలేకరి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బోనాల పండుగను ప్రతిబింబించే ఫొటో జ్ఞాపికను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేతకు ఆయన స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని దరువు అంజన్న ఆధ్వర్యంలో 'కలాల గళాల వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు, పత్రికా విలేకరులు, రాజకీయ నాయకులను ఆహ్వానించి బోనాల పండుగను ప్రతిబింబించేలా ఆట, పాటలతో పాటు సామాజిక మేల్కొలుపు, ఉపన్యాసాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. కళాకారులు, విలేకరులు, వివిధ రంగాల ప్రముఖులను సత్కరించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన దరువు అంజన్నతో పాటు ప్రతి ఒక్కరికీ జిల్లా గణేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి మధు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో కూన శ్రీశైలం గౌడ్



(ఆగస్టు -18- హంస కలంవార్త )

సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన బిడ్డగా అణగారిన వర్గాల హక్కుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారని గుర్తు చేశారు. గోల్కొండ కోటలపై సామాన్యుల హక్కులు, సమానత్వం, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ పోరాడారని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర





మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధు యాష్కి గౌడ్తో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, గౌడ కుల సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి: మాధవరం కృష్ణారావు



(ఆగస్టు -18- హంస కలంవార్త )

అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్తో కలిసి సఫ్దర్‌నగర్ ఈ-బ్లాక్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న రోడ్లు, మంచినీటి సమస్యలను పరిశీలిం చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకునే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశిం చారు. అవసరమైన పనులకు నిధుల కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాముని చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే.. హెచ్ఎండిఏ అధికారులకు పలు సూచనలు చేశారు. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ లేకుండా గత పదేళ్లుగా కృషి చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో అల్లాపూర్ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని పనులు పెండింగ్‌లో పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్ప టికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసిద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఇలయ్య, వీరారెడ్డి, సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

(ఆగస్ట్-18- హంస కలంవార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహణ కూకట్‌పల్లి: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి, బాలాజీనగర్, మూసాపేట్ తదితర డివిజన్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వద్దేపల్లి రాజేశ్వరరావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ



సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావుకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వద్దేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుంచి ఎదిగి, సామాన్య ప్రజలనే తన పోరాట శక్తిగా మలుచుకుని తెలంగాణ నేలపై స్వీయ పాలనకు పునాది వేసిన అసాధారణ ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సుమారు మూడున్నర శతాబ్దాల క్రితమే సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ పోరాడారని పేర్కొన్నారు. సామా న్యుడిగా ప్రారంభమై నాయకుడిగా, యోధుడిగా, పాలకుడిగా ఎదిగి తన కాలంలోని అధికార వ్యవస్థను సవాలు చేసిన ప్రజా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. పాపన్న గౌడ్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక తిరుగుబాటు అని వద్దేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఆయన ధైర్యం, ప్రజా సంక్షేమ దృక్పథం, సమానత్వ భావన నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమాజంలోని అన్ని



వర్గాల ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియాన్ని సందర్శించనున్న మంత్రి జూపల్లి



( ఆగస్టు -18- హంస కలంవార్త )

హైదరాబాద్, ఆగస్టు 18: పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రేపు ఉదయం 10 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియాన్ని సందర్శిం చనున్నారు. ఈ సందర్భంగా మ్యూజియంలోని పురావస్తు ప్రదర్శనలు, చారిత్రక వస్తువులు, తెలంగాణకు చెందిన వారసత్వ సంపదను మంత్రి పరిశీలించనున్నారు. మ్యూజియంలో అందుబాటులో ఉన్న ప్రదర్శనల వివరాలను అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. అదేవిధంగా మ్యూజియం




అభివృద్ధి, ఆధునికీకరణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మంత్రి చర్చించనున్నారు.

## కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్వే ట్రాఫిక్ నిర్వహణపై కమిషనర్ సజ్జనర్ క్షేత్రస్థాయి పరిశీలన





( ఆగస్టు -18- హంస కలంవార్త )

హైదరాబాద్, ఆగస్టు 18: కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలవుతున్న వన్వే ట్రాఫిక్ నిర్వహణ తీరును నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మంగళవారం బైక్పై స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు సీపీ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీ (ఎస్బీ, శాంతిభద్రతలు, నార్త్ రేంజ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, ఐపీఎస్లతో కలిసి కమిషనర్ ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఫిల్మ్నగర్, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్క్ ప్రధాన ద్వారం, ముగ్ధ, బసవతారకం, అగ్రసేన్ జంక్షన్ల మీదుగా ప్రయాణిస్తూ వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితులను నిశితంగా పరిశీలించారు.



వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ను మరింత క్రమబద్ధీకరించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు, ప్రజలకు సాఫీగా ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని, వన్వే నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డేవిస్, ఐపీఎస్, డీసీపీ ట్రాఫిక్ కాజల్ సింగ్, ఐపీఎస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం

( ఆగస్టు -18- హంస కలంవార్త )

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవంతో పాటు సామాజిక న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సాగించిన అలుపెరగని పోరాటం నేటి సమాజానికి, భావితరాలకు మహోన్నత స్ఫూర్తిదాయకమని పలువురు గౌడ సంఘం నాయకులు స్మరించారు. సర్దార్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని కురుమర్తి రోడ్డులో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు, స్థానిక ప్రతినిధులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నరసింహా గౌడ్, కట్టంగూర్ గౌడ సంఘం అధ్యక్షులు కొంపెల్లి యాదయ్య గౌడ్, మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రాంబాబుగౌడ్, మండల గౌడ యువజన సంఘం అధ్యక్షులు ఎరుకల లక్ష్మీనారాయణ గౌడ్ లు మాట్లాడుతూ పాపన్న గౌడ్ ధైర్యసాహసాలను, ఆయన విప్లవాత్మక పోరాట పటిమను అందరూ స్మరించుకోవాలన్నారు. నాటి నిరంకుశ పాలనపై తిరుగుబాటు జెండా ఎగరేసి, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ పోరాడారని కొనియాడారు. కుల, మత రహిత సమాజ స్థాపన, సోదరభావం, సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండు పరమేష్ గౌడ్, పెద్ది ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్ది బాల నరసింహ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఐతగోని నరసింహ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అంతటి శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చాల వెంకన్న గౌడ్, నర్సింగ్ దుర్గయ్య, కానుగు లింగయ్య గౌడ్, వార్డు సభ్యులు ఐతగోని సైదులుగౌడ్, కానుగు శ్రీనుగౌడ్, ఎరుకల శశిధర్ గౌడ్, అయితగోని సైదమ్మతోపాటు ఎరుకల మల్లేష్ గౌడ్, గుండు శేఖర్ గౌడ్, దోరేపల్లి యాదగిరిగౌడ్, పోగుల సాయికుమార్, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, అంతటి రామకృష్ణ, ఐతగోని శివ గౌడ్, అంతటి నాగేష్, అంతటి గణేష్, పొడిచేటి లింగయ్య, ఐతగోని నాగయ్య, పోగుల నరసింహ, కొంపల్లి లక్ష్మయ్య, చెవుగోని జనార్ధన్, చెవుగోని చంద్రయ్య, మాదగోని దశరథ, మాదగోని సోములు, నర్సింగ్ నరసింహ, ఐతగోని మల్లికార్జున్ గౌడ్, ఐతగోని రాజు, పాలకూరి



లక్ష్మణ్, పల్స సందీప్, అంతటి రామకృష్ణ, పోగుల యాదగిరి, పెద్ద ఎత్తున గౌడ యువత తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచ్ నివాళులు..**

బహుజన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో విగ్రహానికి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సంఘం మండల అధ్యక్షులు ఎరుకల లక్ష్మణ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అంతటి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యుడు ఏనుగు సైదులుగౌడ్, నాయకులు పోగుల నరసింహ గౌడ్, కొంపెల్లి లక్ష్మయ్యగౌడ్, ఎరుకల సత్తయ్య గౌడ్, అంతటి గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## "బిడ్డ భవిష్యత్తు కోసం కనికరించండి" అంటూ కలెక్టర్ ముందువింతంతువు కన్నీరు

**-భర్త చావు... అన్న-వదిన దోపిడీ!**
**-ఆస్థి కోసం కన్నేసిన ప్రభుత్వ టీచర్లు...**
**-టీచర్ల అమానుషం, ఆస్థి పత్రాలు,15 తులాల బంగారం లాక్కున్నారు...!**
**-ధర్మపురిలో వింత ఘటన**

( ఆగస్టు -18- హంస కలంవార్త )

గుండెపోటుతో భర్తను కోల్పోయిన బాధ ఒకవైపు, మరోవైపు కట్టుకున్న వారే ఆస్తి కోసం గొంతు పిసుకుతున్నారనే భాధతో ఓ వింతంతువు మానసిక క్షోభను అనుభవిస్తు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిన ఈ ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండల ంలో చోటుచేసుకుంది. ఈ విషయమై జగిత్యాల జిల్లా కలెక్టర్ కు తన కూతురు చిన్మాయితో కలిసి వింతంతువు మానస న్యాయం చేయాలనీ వినతిపత్రం సమర్పించారు.

**-మానస తెలిపిన వివరాల ప్రకారం....**

ధర్మపురికి చెందిన దహగాం గిరీష్ 2025 ఏప్రిల్ 18న అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు. భార్య మానస, 10 ఏళ్ల కూతురు చిన్మయి అనాథలయ్యారు. ఈ విషాదాన్ని కూడా లెక్క చేయకుండా గిరీష్ అన్న దహగాం గణేష్, వదిన కాసర్ల లావణ్య ఆస్తిపై కన్నేశారు.

**-ఆస్తి పత్రాలు, బంగారం బందీ**

గిరీష్ పేరున ఉన్న పొలం పత్రాలు, ఇంటి పత్రాలతో పాటు సుమారు 15 తులాల బంగారాన్ని కూడా వారు బలవంతంగా తమ వద్ద ఉంచుకున్నారని మానస ఆరోపించారు. "అక్కా, భావ అని కాళ్లు పట్టుకుని బతిమాలాను. నా బిడ్డ చదువు కోసం, భవిష్యత్తు కోసం ఇవ్వమని వేడుకున్నాను. కానీ కనీసం కనికరం కూడా చూపలేదు" అంటూ మానస గుక్కపెట్టి ఏడ్చారు. ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటే... ఆరోపణలు ఎదుర్కొంటున్న గణేష్ ధర్మపురి లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తోటి కోడలు కాసర్ల లావణ్య జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పిల్లలకు విలువలు నేర్పాల్సిన వారే, ఓ వితంతువును, చిన్నారిని వేధిస్తున్నారని స్థానికులు మండిపడు తున్నారు.

**-కలెక్టర్కు పరుగు...**
**న్యాయం కోసం పోరాటం**

ఎక్కడా న్యాయం జరగకపోవడంతో విసిగిపోయిన మానస, కూతురు చిన్మయితో కలిసి నేరుగా జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. "మాకు న్యాయం చేయండి సార్. ఆస్తి పత్రాలు, బంగారం ఇప్పించండి" అంటూ వినతిపత్రం అందజేశారు.



న్యాయ నిపుణులు ఏమంటున్నారు? హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం భర్త చనిపోతే ఆస్తిలో భార్య, పిల్లలదే మొదటి హక్కు అన్నారు. అన్నకు ఎలాంటి వాటా ఉండదని, అలాగే స్త్రీకి ఇచ్చిన బంగారం "స్త్రీధనం" కిందకు వస్తుందని, దాన్ని ఎవరూ అడ్డుకోలేరని, బాధితులు వెంటనే పోలీస్ కంప్లైంట్, రెవెన్యూ అధికారుల ద్వారా వారసత్వ సర్టిఫికేట్, డీ ఎల్ ఎస్ ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం తీసుకోవచ్చని చెబుతు న్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి డీఈఓ కు ఫిర్యాదు చేయాలని వారు సూచిస్తున్నారు. భర్త లేని లోటును భర్తీ చేయకుండా, ఉన్న కొద్దిపాటి ఆస్తి కోసం సమాజానికి దిక్సూగా ఉండాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు స్పందించి తక్షణ న్యాయం చేయాలని మానస కోరుతున్నారు.

## బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా సంధ్య

( ఆగస్టు -18- హంస కలంవార్త )



బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన ఐదో వార్డు సభ్యురాలు శ్రీరామ్ సంధ్య వీరేశం నియామక మయ్యారు. ఈ మేరకు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావిళ్ళ కాశమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సమస్యల పరిష్కారం కొరకు తన వంతు కృషి చేస్తానని, పార్టీని మండలంలో బలోపేతం చేసేందుకు శక్తివంతం లేకుండా పనిచేసానని సంధ్య తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, పార్టీ జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రావిళ్ళ కాశమ్మ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి

**-బీసీ జెఏసి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించిన...బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్**



( ఆగస్టు -18- హంస కలంవార్త )

తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని బిసి జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక మిర్యాలగూడ పట్టణంలో బీసీ బాలురావు సతి గృహంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి ఘనంగా పూలమాలతో గవన్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మొగలాయిలపై పోరాడిన యోధులు మొట్టమొదటి బహుజన వీరుడు బహుజన చక్రవర్తి బహుజన నాయకుడు దొరల అరాచకాలకు మొగలాయిల దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. పాపన్న ఒక సామాన్య గౌడ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అతనికి ప్రజల కష్ట సుఖాలు తెలుసని అన్నారు. బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక ఆర్థిక దౌర్జన్య రాజకీయ పరిస్థితులను గమనించేవారన్నారు. యుక్త వయస్సు వచ్చేనాటికి దౌర్జన్యాలను దోపిడి వర్గాలను క్రమక్రమంగా వ్యతిరేకించేవాడన్నారు. తాబేదారులు జమీందారులు జాకీ ర్దారులు దొరలు భూస్వాములు చేసే దురాగతాలను గమనించి గోల్కొండ కోటపై బడుగు వారి జెండా ఎగరవేయాలని ఆ దిశగా నిర్ణయం ప్రస్థానం ప్రారంభించారన్నారు. అయితే సాయన్నకు ఏలాంటి వారసత్వ నాయకత్వం ధనం అధికారశీ గాని లేవని అన్నారు. తన సొంతంగా గేరెళ్ల సైన్యాన్ని తయారు చేసుకుని ఆ సైన్యం ద్వారా మొగల్ సైన్యం పై దాడి చేసి తన సొంత ఊరు కిలాసాపూర్లోని రాజధానిగా చేసుకొని 1675 పాపన్న గౌడ్ రాజ్యాన్ని స్థాపించాడన్నారు. ఒక సామాన్యమైన వ్యక్తి శత్రువు దుర్భేగ్యమైన కోటలను వశపరచుకోవడం అతని దుర్మార్గానికి నిదర్శనం అని అన్నారు. పాపన్న గౌడ్ 20గోడలను ఆధీనంలోకి తెచ్చారన్నారు. ఎక్కుతూ దాదాపు 12 వేల సైనికులను సమకూర్చుకొని ఎన్నో కోటలను చివరకు గోల్కొండ కోటను సాధన పరచుకొని ఏడు నెలల పాటు అధికారం చలాయించారన్నారు. అలాగే భువనగిరి కోటను రాజధానిగా చేసుకుని 30 సంవత్సరాలు పరిపాలించారన్నారు. కాబట్టి శ్రీ సరదా సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ముఖ్యంగా యువకులు ఆయన ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరు సమాజాభివృద్ధికి నడుంబిగించి కలిసి కట్టుగా కృషి చేయాలి పాటుపడాలన్నారు ఈ కార్యక్రమంలో.బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య, రజక, బీసీ బాలుర వసతి గృహ వార్డెన్ తరుణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు, ముదిరాజ్ సామాజికవేత్త తెలంగాణ ఉద్యమకారుడు యం డీ మహమ్మద్ కొత్తగూడెం బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, నిఖిల్, నాగరాజు, చైతన్య, భరత్, ఈశ్వర్, కార్తీక్, సుమన్, నవీన్, శివ, అనిల్, భాను, విక్రమ్, సాయిరాం, జాన్, గోపి దత్తు, రాజేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## 5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి.. నివేదికలో ఆసక్తికర విషయాలు!

**2030 నాటికి భారత్‌లో 62 శాతానికి చేరనున్న 5జీ వినియోగం**
**ఆసియా పసిఫిక్ సగటును అధిగమించనున్న ఇండియా**
**కవరేజీ కంటే వినియోగం పెంచడమే అసలు సవాల్ అని వెల్లడి**
**భారత్ డిజిటల్ ప్రగతిపై జీఎస్ఎంఏ నివేదికలో ప్రశంసలు**



5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని 'గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్'(జీఎస్ఎంఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువ కావడం విశేషం. ఈ ప్రాంతంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా 'ప్రముఖ దేశం'గా జీఎస్ఎంఏ గుర్తించింది. ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. 'భారత్‌నెట్', 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎంజీదిశ)' వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. అదే సమయంలో డిజిటల్ నమ్మకాన్ని పెంపొందించడం కూడా భారత్‌కు ఆర్థిక ప్రాధాన్యతగా మారుతోందని, 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు దేశంలో అమలవుతున్న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం దోహదపడుతోందని తెలిపింది. టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, 'ఆత్మనిర్భర్ భారత్' విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని వివరించింది. 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (×శీ) వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

# క్రీడలు

## గాలే టెస్టుపై భారత్ పట్టు.. విజయం దిశగా టీమిండియా




**గాలే టెస్టులో శ్రీలంకపై పట్టు బిగించిన భారత్**
**372 పరుగుల లక్ష్య ఛేదనలో 84/4తో శ్రీలంక తడబాటు**
**రెండు వికెట్లతో రాణించిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్**
**సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలకు చెరో వికెట్**
**విజయానికి భారత్ 6 వికెట్ల దూరంలో..**
**లంకకు ఇంకా 288 పరుగులు అవసరం**

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్ పై భారత్ పూర్తి పట్టు సాధించింది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి కష్టాల్లో పడింది. విజయానికి టీమిండియా కేవలం 6 వికెట్ల దూరంలో నిలవగా, లంక గెలవాలంటే చివరి రోజు ఇంకా 288 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నాలుగో రోజు ఆటలో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బౌలింగ్ ప్రారంభించిన భారత్‌కు పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతమైన శుభారంభం అందించారు. సిరాజ్ తన బౌన్సర్‌తో నిషాన్ మదుష్క (6)ను ఔట్ చేసి తొలి వికెట్ అందించగా, ఆ తర్వాతి ఓవర్లోనే మానవ్ సుతార్.. దినేష్ చండీమాల్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పసిందు సూరియబండార (0)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కొద్దిసేపటికే ప్రసిద్ధ్ కృష్ణ.. కమిందు మెండిస్ (2)ను కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయడంతో శ్రీలంక 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో లహిరు ఉదార (16), కెప్టెన్ ధనంజయ డిసిల్వా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే, మరోసారి బౌలింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ ఈ జోడీని విడదీసి తన రెండో వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సోనాల్ దినుష (25 నాటౌట్)తో కలిసి ధనంజయ డిసిల్వా (31 నాటౌట్) పోరాడటంతో నాలుగో రోజు మరో వికెట్ పడకుండా లంక ముగించగలిగింది. వీరిద్దరూ అజేయంగా ఐదో వికెట్‌కు 37 పరుగులు జోడించారు. వెలుతురు మందగించడంతో అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేశారు. అంతకుముందు, నాలుగో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషబ్ పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 69 బంతుల్లో 66 పరుగులు చేశాడు. దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కూడా రాణించి జట్టుకు విలువైన పరుగులు అందించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్ శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. లంక బౌలర్లలో అసింత ఫెర్నాండో 4, ప్రభాత్ జయ సూర్య 3 వికెట్లు పడగొట్టారు.

## గాలే టెస్టులో భారత్ ఆలౌట్.. శ్రీలంక ముందు భారీ లక్ష్యం

**గాలే టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 193 రన్స్‌కు ఆలౌట్**
**శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్**
**రిషభ్ పంత్ మెరుపు హాఫ్ సెంచరీ (66)**
**లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండోకు నాలుగు వికెట్లు**

గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకే ఆలౌటైనప్పటికీ, తొలి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యంతో కలిపి లంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ (66) తనదైన శైలిలో మెరుపు అర్ధ శతకం సాధించడంతో భారత్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండో నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. నాలుగో రోజు ఆట ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) డకౌట్‌గా వెనుదిరగ్గా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (8) కూడా నిరాశపరిచాడు. కేఎల్ రాహుల్ (35) కాసేపు క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా, ప్రబాత్ జయసూర్య అతడిని పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ 81 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో దేవ్‌దత్ పడిక్కల్ (44) మరోసారి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే అతడు ఔటైన తర్వాత వచ్చిన రిషభ్ పంత్ తన మార్క్ విధ్వంసం సృష్టించాడు. లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో టెస్టుల్లో తన 20వ అర్ధ శతకాన్ని, 100 సిక్సర్ల మైలురాయిని అందుకున్నాడు. పంత్ జోరు చూస్తే భారత్ స్కోరు మరింత పెరిగేలా కనిపించినా, లహిరు కుమార బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే లంక బౌలర్లు అసిత ఫెర్నాండో (4/31), ప్రబాత్ జయసూర్య (3/43) విజృంభించడంతో భారత టెయిలెండర్లు చేతులెత్తేశారు. దీంతో భారత్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ప్రస్తుతం మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యంలో ఉంది. నాలుగో రోజు ఆటలో ఇంకా 47 ఓవర్లు మిగిలి ఉన్నాయి. దీనికి తోడు ఐదో రోజు ఆట కూడా ఉండటంతో, ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించడం శ్రీలంకకు దాదాపు అసాధ్యమనే చెప్పాలి. అయితే, శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభానికి ముందు వర్షం పడటంతో ఆటకు అంతరాయం కలిగింది. ఇవాళ వర్షం ఆగి, భారత బౌలర్లు కొన్ని వికెట్లు తీస్తే.. రేపు టీమిండియా సునాయాసంగా విజయం సాధించే అవకాశాలున్నాయి.



# నిధి అగర్వాల్ కొత్త సినిమా ఈసారి ఏకంగా మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తు న్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది. సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం




చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

## రామ్ పోతినేని డెడికేషన్‌కు హాట్సాఫ్.. ఆపకుండా 24 గంటల పాటు షూటింగ్

హీరో రామ్ పోతినేని తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాపో23' కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు హీరోగానూ నటిస్తున్న రామ్.. పుదుచ్చేరి శివార్లలో ఏకంగా 24 గంటల పాటు నిర్విరామంగా షూటింగ్‌లో పాల్గొన్నట్లు సినీ వర్గాల సమాచారం. నటుడిగా తన పాత్రను పూర్తి చేయడంతో పాటు దర్శకుడిగా సినిమా చిత్రీకరణను పర్యవేక్షిస్తూ రామ్ బిజీగా ఉన్నారు. ఈ విషయంలో ఆయన చూపిస్తున్న అంకితభావంపై చిత్ర బృందం ప్రశంసలు కురిపిస్తోంది. 'రాపో23' కోసం పుదుచ్చేరిలో భారీ స్థాయిలో ప్రత్యేక సెట్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు తొమ్మిది రోజుల పాటు అక్కడ షూటింగ్ కొనసాగింది. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షాలు రావడంతో చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీంతో షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసి చిత్ర బృందం హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. మిగిలిన సన్నివేశాలను పూర్తి చేసేందుకు త్వరలోనే మరోసారి పుదుచ్చేరికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.



# 'ఫారెస్ట్ గార్డ్' (ఆహా) మూవీ రివ్యూ!

మలయాళంలో రూపొందిన సైకలాజికల్ సర్వైవల్ థ్రిల్లర్ 'మీషా'. తమిళ నటుడు కథిర్ చేసిన తొలి మలయాళ సినిమా ఇది. హకీమ్ షాజహాన్ .. షైన్ టామ్ చాకో కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, ఈ ఎంసీ జోసెఫ్ దర్శకత్వం వహించాడు. ఈ ముగ్గురు ఆర్టిస్టులులకు మంచి క్రేజ్ ఉండటంతో, సహజంగానే అంచనాలు పెరిగిపోయాయి. అడవి నేపథ్యంలో సాగే ఈ సినిమా, 'ఫారెస్ట్ గార్డ్' పేరుతో ఈ నెల 15వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది.మిథున్ (కథిర్) ఫారెస్ట్ ఆఫీసర్ గా పనిచేస్తుంటాడు. చాలా దట్టమైన అడవీ ప్రాంతంలో అతను విధులను నిర్వహిస్తుంటాడు. ఒక రోజున అతను తన స్నేహితుడు ఆనంద్ (హకీమ్)కి కాల్ చేస్తాడు. మరుసటి రోజున తమ స్నేహితుడైన ఇమ్మాన్యుయేల్ (సుధీ కొప్ప)ను తీసుకుని తన దగ్గరికి వచ్చేయమని చెబుతాడు. వాళ్ల కోసం తాను జింక మాంసం వండిస్తానని అంటాడు. ఏడాదిన్నర తరువాత తామంతా కలిసి ఎంజాయ్ చేయనున్నట్టుగా చెబుతాడు. అందుకు ఆనంద్ అంగీకరిస్తాడు. ఆ మరుసటి రోజునే ఆనంద్ నేరుగా వెళ్లి రాజకీయ నాయకుడైన పోతు రఘు (జో బేబీ)ను కలుస్తాడు.మిథున్ నుంచి కాల్ వచ్చిన విషయం చెబుతాడు. మిథున్ జింక మాంసం రెడీ చేయగానే తమకి సమాచారం అందించమని అంటాడు రఘు. అతనిని అరెస్టు చేయించి జైల్లో పెట్టించడమే తమకి మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. అందుకు అంగీకరించిన ఆనంద్, ఆ మర్నాడు ఇమ్మాన్యుయేల్ ను వెంటబెట్టుకుని ఫారెస్టుకు వెళతాడు. అదే సమయంలో తన తండ్రి అంత్యక్రియలను ఘనంగా చేయాలనే ఉద్దేశంతో కృష్ణ ( షైన్ టామ్ చాకో) ఉంటాడు. అడవి జంతువులను వేటాడి తీసుకు రావడం కోసం, డైనమేట్ బషీర్ ను .. తిరుపతి .. సునీని వెంటబెట్టుకుని అడవిలోకి వెళతాడు. అడవి జంతువులను పట్టించడానికి కృష్ణ వెళితే, ఫారెస్టు ఆఫీసర్ ను పట్టివ్వడం కోసం ఆనంద్ వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? ఎవరి ప్రయత్నం ఫలిస్తుంది? రాజకీయనాయకుడైన రఘుతో మిథున్ కి గల వైరం ఏంటి? అనేది మిగతా కథ.అడవిలో పార్టీ చేసుకోవడం కోసం ముగ్గురు స్నేహితులు ప్లాన్ చేస్తారు. బంధువుల భోజనాలలోకి అవసరమైన వేట మాంసం కోసం కృష్ణ తన బృందంతో అడవిలోకి వెళతాడు. అక్కడ చోటుచేసుకునే పరిణామాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అడవిలో ఏం జరుగుతుంది? అక్కడి నుంచి ఎవరు ప్రాణాలతో బయటపడతారు? అనేది ఆడియన్స్ లో కుతూహలాన్ని పెంచుతూ సాగుతుంది. ఒక గ్రామానికి చెందిన మిథున్ అక్కడి నుంచి అడవికి ఎందుకు మారిపోతాడు? అతని స్నేహితులే అతనిని చూసి బయటపడటానికి కారణాలు ఏమిటి? ఊరికి దూరంగా బ్రతుకున్నప్పటికీ రాజకీయ నాయకులు మిథున్ ను ఎందుకు టార్గెట్ చేస్తారు? అతను తన స్నేహితులను అడవికి ఆహ్వానించడంలోని ఆంతర్యం ఏమిటి? అనే విషయాలు ..అందుకు సంబంధించిన ఫ్లాష్ బ్యాకులు ఈ కథలో ఆసక్తిని రేకెత్తించే బలమైన అంశాలుగా కనిపిస్తాయి.గ్రామీణ నేపథ్యం .. అక్కడి సమస్యలు .. రాజకీయాలు .. ప్రేమలు .. గొడవలు వంటి అంశాలను టచ్ చేస్తూ ఈ కథను నడిపించడంలో దర్శకుడు చాలావరకూ సక్సెస్ అయ్యాడు. ప్రతి పాత్రను .. ప్రతి సన్నివేశాన్ని ఆవిష్కరించిన విధానం పెర్ఫెక్ట్ గా అనిపిస్తుంది. అటు విలేజ్ .. ఇటు ఫారెస్టు నేపథ్యంలో సన్నివేశాలను ఆవిష్కరించిన తీరు చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. జోసెఫ్ టేకింగ్ .. సురేశ్ రాజన్ ఫొటోగ్రఫీ .. సూరజ్ కురూప్ నేపథ్య సంగీతం .. మనోజ్ ఎడిటింగ్ మెప్పిస్తాయి. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా చాలా బాగా చేశారు. కథాకథనాలు ఒక ఎత్తయితే, కథ కోసం ఎంచుకున్న లొకేషన్స్ ఒక ఎత్తు అని చెప్పాలి. లొకేషన్స్ ఈ సినిమాకి ప్రధానమైన బలమనీ .. ఆకర్షణ అని చెప్పవలసి ఉంటుంది. అయితే లవ్.. రొమాన్స్ అనే అంశాలను దర్శకుడు ఎంత మాత్రం టచ్ చేయడకపోవడం మాత్రం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తుం దనే చెప్పాలి. భయం బలహీనత స్వార్థం ఉన్నవారు అవతలివారి జీవితాలను బలి తీసుకుంటారు. త్యాగానికి సరైన గుర్తింపు దక్కకుండా చేస్తారు. అలాంటప్పుడే ప్రజలు అసలు నిజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలనే సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449